సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



ఉచ్చుకు బలైంది చిరుతపులే

భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలి అయింది చిరుతపులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

- 8లో▸



గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

గంజాయ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠా టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ తెలిపారు.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులు, సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టెన్త్ విద్యార్థుల సందేహాల నివృత్తికి 'ఫోన్‌ఇన్'

విద్యారణ్యపురి: ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఆయా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు విషయ బోధకులతో ఫోన్ ఇన్ కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నామని డీఈఓ అబ్దుల్‌హై, డీసీఈబీ కార్యదర్శి రాజన్న మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గత టెన్త్ పరీక్షలకు 11 ప్రశ్న పత్రాలు ఉండగా ఈసారి జరగబోయే పరీక్షల్లో ఆరు పేపర్ల మాత్రమే రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు కూడా 80 మార్కుల చొప్పున ప్రశ్నపత్రాలు ఉంటాయని, సామాన్యశాస్త్రం, భౌతిక శాస్త్రంలో 40చొప్పున 80 మార్కులకు ఒకేరోజు రెండు వేర్వేరు జవాబుపత్రాలు రాయాల్సి ఉంటుందని వివరించారు. సందేహాల నివృత్తికి విద్యార్థులు ఈ కింది ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

డీఈఓ : 79950 87651
జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి- 94414 13172

తెలుగు	: 93911 99277
హిందీ	: 97016 83140
ఇంగ్లిష్	: 99593 23075
గణితం	: 98494 31543
భౌతికశాస్త్రం	: 98668 56373
జీవశాస్త్రం	: 98495 00462
సాంఘికశాస్త్రం	: 80198 24250

ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్యులపై దాడిచేస్తే చట్టరీత్యా చర్యలు



ఎంజీఎం : ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్యులపై దాడులు జరిగితే యాక్ట్ నంబర్ 11 ఆఫ్ 2008 ప్రకారం చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హామీ ఇచ్చినట్లు ఐఎంఏ, తానా వైద్యులు తెలిపారు. ఆస్పత్రుల సంరక్షణ, వైద్యుల రక్షణ కోసం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీతో కలిసి వైద్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తానా, ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ వైద్యులు, వైద్యసిబ్బందిపై ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడినా, వారి విధులకు అడ్డుపడినా మూడేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా, బెయిల్ లభించకుండా ఉన్న చట్టాన్ని అమలు చేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్, వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, సెక్రటరీ రాకేశ్‌రెడ్డి, ఎం.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేటినుంచి 'పది' ప్రీఫైనల్ పరీక్షలు

విద్యారణ్యపురి: జిల్లాలో టెన్త్ విద్యార్థులకు బుధవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై టైంటేబుల్‌ను విడుదల చేసి హెచ్ఎంలకు పంపారు. ఈ నెల 22న తెలుగు, 23న హిందీ, 24న ఇంగ్లిష్, 25న మ్యాథ్స్ 27న ఫిజికల్‌సైన్స్, బయోలజికల్‌సైన్స్ 28వ తేదీన సోషల్ పరీక్షలు ఉంటాయి. పరీక్షలు ఉదయం 9–30నుంచి 12–30 గంటల వరకు జరుగుతాయి. పరీక్షలు జరిగిన వెంటవెంటనే జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు తెలియజేయాల్సింటుంది. మార్చి 1, 2, 3 తేదీల్లో పిల్లలకు ప్రశ్నపత్రాలపై రాసిన జవాబులను బట్టి వారికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సి ఉంది.

నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే బిల్లుల్లో కోత



వరంగల్: జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులను తగు నాణ్యతతో పూర్తి చేయాలని, లేనిపక్షంలో బిల్లుల్లో కోత విధించాలని బల్దియా కమిషనర్ ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు కాలనీల్లో పూర్తయిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి, బిల్లుల చెల్లింపుపై ఆదేశాలు ఇచ్చారు. 31వ డివిజన్ సీఎస్ఆర్ గార్డెన్ ప్రాంతంలో నిర్మించిన డ్రెయినేజీలు, 42వ డివిజన్ రంగశాయిపేట ప్రాంతంలో వెడల్పు చేసిన సీసీరోడ్డు, 40వ డివిజన్ ఉర్సు ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్డు, మురుగు కాల్వలను పరిశీలించారు. ఉర్సుగుట్ట ప్రాంతం నుంచి నాయుడు పెట్రోల్ పంప్ వరకు సెంట్రల్ మీడియమ్స్‌లలో ఏర్పాటు చేసిన మొక్కలను కమిషనర్ పర్యవేక్షించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజయ్య, శ్రీనివాస్‌రావు, డీఈలు సంతోష్ బాబు, నరేందర్, ఏఈలు అరవింద, హబీబుద్దిన్, ముజమ్మిల్ పాల్గొన్నారు.

భౌ..భౌ.. భయం

పగలైనా..రాత్రి అయినా నగరంలో నడిచి వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. దారి దోపిడి, గొలుసు దొంగలు కాదు. గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలతో ప్రజలు వణికిపోతున్నారు. కొన్ని కాలనీల్లో అయితే చిన్నపిల్లలు, వృద్ధులు అడుగు బయట పెట్టాలంటే భయపడిపోతున్నారు. వీధుల్ని, కాలనీలను పంచుకుని కుక్కల గుంపు మీద పడుతోందని ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాన్ని వెంబడిస్తూ ఒంట్లో వణుకుపుట్టిస్తున్నాయి. కుక్కల శస్త్ర చికిత్సల పేరిట ఏటా బల్దియా నిధులు ఖర్చు చేస్తున్నా వాటిసంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. హైదరాబాద్‌లో ఓ బాలుడిని కుక్కలు చంపిన ఘటనతోనైనా ఇక్కడి బల్దియా మేల్కోనాలని నగరవాసులు కోరుతున్నారు.

-వరంగల్ అర్బన్





కుక్కల కాట్లతో నగర జనం బెంబేలు ● 'గ్రేటర్'లో 60వేలు దాటిన శునకాలు

- ఏటా రూ.అరకోటి ఖర్చు చేసినా.. కాట్లే
- శస్త్రచికిత్సల్లో కాకి లెక్కలే ఆధారం
- ఎంజీఎం ఆస్పత్రికి రోజూ పదుల సంఖ్యలో కేసులు
- హైదరాబాద్ అంబర్‌పేట ఘటనతోనైనా మేల్కొనేనా..

కుక్కలతో జనం బెంబేలు...

నగరంలోని 66 డివిజన్లలో రోజూ అనేక కాలనీల్లో నగరవాసులు కుక్క కాట్లకు గురవుతున్నారు. ఎంజీఎం ఆస్పత్రికి 15 నుంచి 20 మంది వస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వారితోపాటు ఈ ఇంజక్షన్ దశల వారీగా వేయించుకోవడానికి మారో 60 మంది వరకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి కాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకుంటున్నారు.

బల్దియా పరిధిలో 60వేలు..

బల్దియా పరిధిలో సుమారు 60వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిని పట్టుకొని శస్త్ర చికిత్స(యానిమల్ బర్త్ కంట్రోల్) చేసేందుకు ప్రత్యేక ఎన్‌జీఓ సంఘం పేరుతో ఓ సంస్థకు టెండర్ ద్వారా బాధ్యత అప్పగించారు. రోజూ నగరంలో 20 వరకు కుక్కలను పట్టుకొని హనుమకొండ చింత గట్టు కెనాల్‌కు సమీపంలో శస్త్రచికిత్సలు చేసి వదిలేస్తున్నారు. అందుకు ప్రతి కుక్కకు బల్దియా రూ.750 చొప్పన చెల్లిస్తోంది. కాలనీ ప్రజలు కుక్కలకు సంబంధించి సమాచారం అందించినప్పటికీ సిబ్బంది ఎక్కువగా స్పందించడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా...

కుక్కలను పట్టుకోవడం. శస్త్ర చికిత్సలు చేయడం, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేపట్టే వెటర్నరీ విభాగానికి ఏటా రూ.50లక్షల నుంచి రూ.60లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారు. వాటిని ఖర్చు చేస్తున్నా.. వీటి బెడదపై బల్దియా కాల్ సెంటర్ ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఏడేళ్ల కాలంలో ఆపరేషన్ ఫర్ డాగ్స్ పేరిట నగరంలో రూ.3కోట్ల ఖర్చు చేశారు. ఇప్పటివరకు సుమారు 38వేల పై చిలుకు కుక్కలకు ఆపరేషన్లు పూర్తి చేసినట్లు రికార్డులు చూపిస్తున్నారు.

ఘటనలు కొన్ని...

- 2013లో ఎస్‌జీఓస్ కాలనీ రోడ్డులో కీర్తిన్ అనే ఆరు నెలల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేస్తే 72 వరకు గాయాలయ్యాయి. లోకాయుక్త ఆదేశాలతో ఆ కుటుంబానికి బల్దియా రూ.50లక్షల నష్టపరిహారం అందజేసింది.
- 2014లో బీరన్నకుంటలో సానియా అనే చిన్నారి తలను కుక్క పట్టి పీకేసింది.
- 2015 జనవరిలో అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తల్లి వెంకటమ్మ కుక్కకాటుకు గురైంది.
- 2022 సెప్టెంబర్‌లో 31వ డివిజన్ కాపువాడలో ఆరుగురు చిన్నారులపై పైశాచికంగా కుక్కలు దాడి చేశాయి.



వేసవిలో అప్రమత్తం కావాల్సిందే

వేసవిలో ప్రతికూల పరిస్థితుల వల్ల కుక్కకాటు బాధితులు పెరుగుతుంటారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం, మంచినీరు దొరక్కపోవడం, చికాకుతో కుక్కలు కరుస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు.

తూర్పులో జోడో జోష్

- రెట్టించిన ఉత్సాహంతో ముందుకు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ 'తూర్పు'లో సాగిన యాత్ర
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విసుర్లు
- అవకాశం ఇస్తే పాలకుర్తిలోనూ పోటీ చేస్తామని 'కొండా' ప్రకటన



గుర్రపు బగ్గీపైనుంచి అభిమానులకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, కొండా సురేఖ

సాక్షి, వరంగల్/వరంగల్/రామన్నపేట: హాథ్ సే హాథ్ జోడో యాత్ర వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో రేవంత్‌రెడ్డితో కలిసి ముందుకు సాగారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. స్థానిక నేతల పాలన తీరును విమర్శిస్తూ.. చురకలు అంటిస్తూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఉత్సాహపరిచేలా చేసింది. మంగళవారం సాయంత్రం 6.28 గంటలకు ఎంజీఎం చౌరస్తాకు చేరుకున్న రేవంత్‌రెడ్డి.. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నాయకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడినుంచి గోపాలస్వామిగుడి జంక్షన్‌కు చేరుకోగా.. చేనేత కార్మిక సంఘం నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు సమస్యలపై వినతిపత్రం అందించి కండువా కప్పి సన్మానించారు. 6.56 గంటలకు పోచమ్మమైదాన్ సెంటర్‌కు, 7.02 గంటలకు మండిబజార్ దర్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. 7.23 గంటలకు వరంగల్ చౌరస్తాకు చేరుకున్న ఆయన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రపు బగ్గీని ఎక్కారు. ఆయన వెంట కొండా దంపతులు ఉండగా.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ వరంగల్ పోస్టాఫీస్ జంక్షన్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి, కొండా మురళిని కాంగ్రెస్ నాయకులు భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

అభివృద్ధి అంతా మేం చేసిందే..

వరంగల్ నగరంలో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలో జరిగిందేనని సభ సాక్షిగా చెప్పుకొచ్చారు. ఎంజీఎం, నిట్, కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ హయాంలోనే నెలకొల్పినట్లు గుర్తు చేశారు. 'తండ్రీకొడుకు కేసీఆర్, కేటీఆర్‌లకు ఇక్కడ ఉండే భూములు, ఆస్తులపై ప్రేమ ఉంది. కానీ.. అభివృద్ధిపై లేదని, అందుకే ఆలోచన చేయండి.. మార్పు రావాలి' అని సభకు హాజరైన ప్రజలను కోరారు. మరోమారు ఇద్దరు ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నరేందర్‌లపై బిల్లా రంగాలు అంటూ విరుచుకుపడ్డారు. భూమి, కాలువ, శిఖం, చెరువు, చివరకు పేదలు, బలహీనులు ఉండే ప్లాట్లు కబ్జా చేసుడే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. వైఎస్ హయాంలో ఎంత గుర్తింపు ఉందో.. రాబోయే ప్రభుత్వంలోనూ కొండా దంపతులకు అదే గుర్తింపు ఉంటుందని, ఇక్కడ సురేఖ గెలుపుతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.





యాత్ర చేస్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన కొండా దంపతులు, మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

అరూరి సొంతూళ్లో 24 బెల్ట్ షాపులంట...

'వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సొంతూరు ఉప్పుగల్ గ్రామ పంచాయతీలో 12 వార్డులుంటే.. బెల్ట్‌షాపులు 24 ఉన్నాయని అక్కడి మహిళలు అన్నారు. వారు తాగొచ్చి పెట్టే కష్టాలతో జీవితాలు ఆగం అవుతున్నాయన్నారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులు ఉండకుండా చూస్తా'మని రేవంత్ అన్నారు.

పాలకుర్తిలోనూ అవకాశమిస్తే కొండా పోటీ..

'వరంగల్‌లో రేవంత్ సభ అనగానే మంత్రి దయాకర్‌రావుకు నిద్ర పట్టడం లేదు. పాలకుర్తిలో మీరన్నా పోటీ చేయాలి. లేదా మేమైనా పోటీ చేస్తాం. మీ లేదా మా చేతిలో దయాకర్‌రావు ఓడిపోవాలి అని చెబుతున్నాం' అని రేవంత్‌రెడ్డితో మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'నేను ఒక్క తల్లి, తండ్రికి పుడితే టీడీపీని వీడను అని దయాకర్‌రావు.. అన్నడు. బీఆర్ఎస్‌లో ఎప్పుడు చేరాడో అప్పుడే సచ్చిపోయిండు. చంపిన పామును చంపాల్సిన అవసరం మాకు లేదు. ఇక వరంగల్ ఈస్ట్ విషయానికొస్తే.. మా హయాంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశాం' అని సురేఖ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో వరంగల్ ఇన్‌చార్జ్ అంజనీకుమార్ యాదవ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, వేం నరేందర్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కొండా సుస్మితా పటేల్, నమిండ్ల శ్రీనివాస్, ఎర్రబెల్లి స్వర్ణ, రవళిరెడ్డి, బట్టి శ్రీనివాస్, సుధాకర్ గౌడ్, అయూబ్‌ఖాన్, మీసాల ప్రకాశ్, కూరతోట సదానందం, మడిపెల్లి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

మితిమీరిన 'నన్నపునేని' ఆగడాలు
ఎమ్మెల్యే నరేందర్‌పై కాంగ్రెస్ చార్జ్‌షీట్ - 8లో

టెన్షన్..టెన్షన్!

- కమిషనరేట్ ముందు కాంగ్రెస్ శ్రేణుల ధర్నా
- తోట పవన్‌ను పరామర్శించిన రేవంత్
- ఆస్పత్రినుంచి ర్యాలీగా కమిషనరేట్‌కు
- మంత్రి, ఎమ్మెల్యేపై టీపీసీసీ చీఫ్ ఆరోపణలు

వరంగల్ క్రైం: యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట పవన్‌పై జరిగిన దాడిని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీపై జరిగిన దాడిగా అభివర్ణించడం.. ఆస్పత్రిలో పరామర్శ.. నాయకులతో కలిసి ఆస్పత్రినుంచి ర్యాలీగా పోలీస్ కమిషనరేట్‌కు రావడం.. కాంగ్రెస్ శ్రేణులు కమిషనరేట్ ఎదుట ఆందోళనకు దిగడంతో నగరంలో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సోమవారం రాత్రి దాడికి గురైన తోట పవన్ హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం బయటకు వచ్చి పోలీస్ కమిషనరేట్ వరకు నడుచుకుంటూ వచ్చారు. రేవంతర్‌రెడ్డి వెంట నడిచేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు పోటీపడ్డారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో వాతావరణం వేడెక్కింది. పోలీస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏం జరుగుతుందో అని టెన్షన్ ఎడ్డారు. కమిషనరేట్‌కు తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు గేటు వద్దే నివారించారు. రేవంత్‌రెడ్డితోపాటు ముఖ్య నేతలను సీపీ రంగనాథ్‌ను కలిసేందుకు అనుమతించారు. ఈ క్రమంలో నేతలు, కార్యకర్తలు కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



పోలీస్ కమిషనరేట్‌కు ర్యాలీగా వస్తున్న రేవంత్‌రెడ్డి

మంత్రి, ఎమ్మెల్యేపై ఆరోపణలు

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మంత్రి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కుట్ర పూరితంగా దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. యువకులను గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలుగా చేసి ఇలాంటి దాడులకు పురికొల్పుతున్నారన్నారు. రేవంత్ వెంట ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ, నేతలు నాయిని రాజేందర్‌రెడ్డి, బలరాంనాయక్, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

పవన్‌పై దాడి చేసిన నలుగురి అరెస్టు

యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట పవన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ మంగళవారం తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు దాడికి కారకులైన చెక్క సుమన్, రావులకోలను నరేందర్, గుడికందుల వినోద్‌కుమార్, చిపిమోర్ సునార్‌కృష్ణలను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. దాడితో సంబంధమున్న మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

వినయ్ క్యాంపు కార్యాలయం వద్ద బందోబస్తు

హన్మకొండ: పవన్‌పై దాడి, రేవంత్‌రెడ్డి యాత్ర నేపథ్యంలో హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ క్యాంపు కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయానికి వచ్చే దారుల్లో ఆందోళనకారులు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు రక్షణగా నిలిచారు.

ఏటా లోటే!

- వాస్తవాలకు దూరంగా బడ్జెట్ అంచనాలు
- నేడు రూ.612.29కోట్లతో గ్రేటర్ వరంగల్ బడ్జెట్
- మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం



పదేళ్ల బడ్జెట్ స్వరూపం ఇలా..

2012–13	రూ.124కోట్లు
2013–14	రూ.158.47కోట్లు
2014–15	రూ.178.17కోట్లు
2015–16	రూ.541.33కోట్లు
2016–17	రూ.503.04కోట్లు
2017–18	రూ.1,043కోట్లు
2018–19	రూ.1,123.97కోట్లు
2019–20	రూ.1,431.31కోట్లు
2020–21	రూ.305.06కోట్లు
2021–22	రూ.559.77కోట్లు
2022–23	రూ.609.47కోట్లు
2023–24	రూ.612.29కోట్లు (ప్రస్తుత బడ్జెట్)

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రతి ఏడాది వేసుకున్న ఆదాయ, వ్యయ అంచనాలను అందుకోవడంలో తలకిందులవుతోంది. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశం జరగనుంది. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.612.29కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి పెద్ద ఎత్తున గ్రాంట్లు వస్తాయని భారీ అంచనాలను తీసుకుంటున్నారు. కానీ ఆ నిధులను రాబట్టుకోవడం, చొరవ చూపించడంలో ఫెయిల్ అవుతున్నారనే విమర్శలను మూటకట్టుకుంటున్నారు. ప్రతి బడ్జెట్‌లో వేస్తున్న లెక్కలు వాస్తవాలకు చాలా దూరంగా ఉంటున్నా సరిదిద్దుకోవాలని గానీ, కాస్తయినా వాస్తవానికి దగ్గరగా ఉండాలని కానీ మహా నగరపాలక సంస్థ పాలక, అధికార వర్గాలు భావించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఏదో ఒక ఏడాది కాదు. ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. బల్దియాకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, వివిధ ఫీజులు, అద్దెలు, అమ్మకం, పన్నులు, టౌన్ ప్లానింగ్, మ్యుటేషన్ చార్జీలతోపాటు ప్రభుత్వం నుంచి కొన్ని రకాల నిధులు వస్తాయి. వీటిని వివిధ పద్దుల కింద చూపిస్తూ మొత్తం కలిపి రెవెన్యూ ఆదాయంగా బడ్జెట్‌లో పేర్కొంటున్నారు. బల్దియా సొంత ఆదాయం చాలా తక్కువ. ప్రతి నెలా వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులకే సరిపోతోంది. కానీ అధికారులు, పాలకులు మాత్రం ప్రతి ఏడాది బయటకు మిగులు బడ్జెట్ చూపిస్తున్నారు. బడ్జెట్ బడ్జెట్ వాస్తవానికి 10 శాతం అటు ఇటుగా ఉండడం లేదు. 30 శాతం నుంచి 40శాతం తేడా వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

బల్దియా ప్రస్థానం..

1893లో చిన్న మున్సిపాలిటీగా ఏర్పాటైన వరంగల్ అంచెలంచెలుగా ఎదిగింది. 1994లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 2004లో మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడింది. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రిసిటీతోపాటు శివారులోని 42 విలీన గ్రామాలతో 2015 జనవరిలో మహా నగర పాలక సంస్థగా అవతరించింది.

అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు

మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్

వరంగల్ అర్బన్: మహా నగర పరిధిలో అనధికార లే అవుట్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి.. అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో అనధికార లే అవుట్‌లు, అభివృద్ధి పనులపై వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలు సులువుగా, వేగవంతంగా భవన నిర్మాణాల అనుమతులు పొందేందుకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ టీఎస్ బీపాస్‌ను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉందన్నారు. అధికారిక, అనధికారిక లే అవుట్‌ల మధ్య ప్రయోజనాలపై నగర ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. సమీక్షలో సిటీ ప్లానర్ వెంకన్న, ఉప ఏసీపీలు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, బషీర్, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయండి

జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. మహానగరంలో పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, తదితర పథకాల కింద కొనసాగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయడంతోపాటు టెండర్ అయిన వాటిని తక్షణమే ప్రారంభించాలన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో చేయని పక్షంలో ఆయా పనులను రద్దు చేయాలన్నారు.

ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణలు

- కాంగ్రెస్ యువజన నేతపై దాడికి బీఆర్ఎస్‌కు సంబంధం లేదు
- కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్. పక్కన అజీజ్‌ఖాన్, ఇతర నాయకులు

హన్మకొండ అర్బన్ : ఉద్యమద్రోహులు.. నికార్సైన ఉద్యమకారులపై ప్రతిపక్షాలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. సోమవారం సుబేదారి ఎస్‌బీహెచ్ కాలనీలోని అయన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. స్వరాష్ట్రం కోసం ప్రాణత్యాగానికైనా వెనకాడక తెలంగాణ తెచ్చిన సీఎం కేసీఆర్ గురించి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు, ఉద్యమకారులకు అండగా ఉన్నది నాటి ఎమ్మెల్యే, నేటి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్న విషయం మర్చిపోవద్దన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు మహేష్ చనిపోతే వారు కుటుంబానికి అండగా ఉండి, అతని భార్యకు కుడాలో ఉద్యోగం కల్పించి ఉద్యమకారులకు అండగా ఉన్నది కేటీఆర్, వినయ్‌భాస్కర్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ యువజన నాయకుడిపై జరిగిన దాడికి బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, ఎలకంటి రాములు, గుంటి రజిత శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, ఏనుగుల మానస రాంప్రసాద్, ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, కిషన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వివాహేతర సంబంధం బట్టబయలు

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త
- కట్టేసి పోలీసులకు అప్పగింత


నాగేందర్‌ను పోలీసులకు అప్పగించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

మంగపేట: ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వివాహేతర సంబంధాన్ని భర్త బట్టబయలు చేశాడు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ ఘటన మంగపేట మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఉపాధ్యాయురాలి భర్త, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు.. మరో ఉపాధ్యాయురాలితో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉపాధ్యాయురాలి భర్త మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. దీంతో కూతురితో అద్దె ఇంట్లో ఉంటున్న ఉపాధ్యాయురాలు, అప్పటికే ఇద్దరు భార్యలను వదిలేసి ఒంటరిగా ఉంటున్న ఉపాధ్యాయుడు నాగేందర్‌కు దగ్గరైంది. సెలవు రోజుల్లో వచ్చి వెళ్తే భర్తను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో అనుమానం వచ్చి కూతురు ద్వారా ఆరా తీయగా అసలు విషయం తెలుసుకున్నాడు. ఈ విషయంపై రెండు నెలల క్రితం పాఠశాల హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశాడు. తన భార్యకు దూరంగా ఉండాలని నాగేందర్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. స్పందించిన అధికారులు ఉపాధ్యాయురాలిని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. అయినప్పటికి నాగేందర్, ఉపాధ్యాయురాలితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయురాలు భర్త కానిస్టేబుల్ ఈ నెల 18న శివరాత్రి బందోబస్తు డ్యూటీపై వేములవాడకు వెళ్లాడు. సోమవారం సెలవు ఉండటంతో మంగపేటలో ఉంటున్న భార్య, కూతురును చూసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నాగేందర్.. ఉపాధ్యాయురాలి సెల్‌కు ఫోన్‌చేయగా భర్త లిఫ్ట్ చేశాడు. 'నేను వస్తున్నా తలుపు తీసి ఉంచు'అని నాగేందర్ చెప్పాడు. తన అనుమానం నిజమైందని భావించిన భర్త తలుపు తీసి బాత్‌రూంలో దాక్కున్నాడు. నాగేందర్ ఇంట్లోకి రాగానే గడియ పెట్టి ఇంతరాత్రి ఇంటికి ఎందుకు వచ్చావు అని అడుగుతున్న క్రమంలో పడుకుని ఉన్న తన భార్య, నాగేందర్ ఇద్దరు కలిసి అతనిపైనే దాడి చేసేందుకు యత్నించారు. దీంతో భయపడిన అతను ఇంటి గడియపెట్టి బయటకు వచ్చి ఇరుగుపొరుగుకు చెప్పాడు. ఉదయం తాళ్లతో ఇద్దరిని బంధించి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

జనగామ: జనగామ పట్టణం వాసవీనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను జనగామ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. చోరీ జరిగిన ఆరు గంటల్లోనే కేసును చేధించారు. రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. వాసవీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడి 9 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ రంగంలోకి దిగి, సీసీ పుటేజీల సాయంతో దొంగను పట్టుకున్నట్లు తెలిసింది. సదరు నిందితుడిపై మూడు రాష్ట్రాల్లో కేసులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

అచ్చం ఒకేలా..

- అబ్బుర పరుస్తున్న ట్విన్స్
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

కవల పిల్లలు అంటేనే వారికో ప్రత్యేక గుర్తింపు. ప్రతిఒక్కరు ఆసక్తిగా గమనిస్తారు. ఒకే రకమైన రూపురేఖలు.. ఒకే రకమైన దుస్తులు ధరించడం వారి ప్రత్యేకత. చాలా మంది కవలలు కనీసం గుర్తు పట్టలేని విధంగా అచ్చం ఒకేలా ఉంటారు. నేడు (బుధవారం) అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా వారి తల్లిదండ్రుల మనోభావాలు మీకోసం..

–నర్సంపేట/దుగ్గొండి


సందేష్‌గౌతమ్- సందేష్‌వివేక్

దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుసుమ జగదీష్–శిరీష దంపతుల కుమారులు సందేష్‌గౌతమ్- సందేష్‌వివేక్ కవలలు. ప్రతియేట వీరిద్దరి పుట్టిన రోజుతో పాటు కవలల దినోత్సవం రోజు కూడా వీరికి తల్లిదండ్రులు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నారు.


హిమ ప్రియ- కీర్తిప్రియ

దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్–వందన దంపతులకు కవల పిల్లలు హిమ ప్రియ– కీర్తిప్రియ ఉన్నారు. 4వ తరగతి చదువుతున్నారు. వీరిని కుటుంబ సభ్యులు మినహా ఎవరూ గుర్తుపట్టరు.

దేవుడి వరంలా భావిస్తాం..


తల్లిదండ్రులు విజయ్‌కుమార్‌ప్రమీలతో కార్తీజాన్వి, కృతిజాన్వి

మాకు మొదటి సంతానంలో కవల కూతుళ్ల జన్మించడం దేవుడిచ్చిన వరంలా భావిస్తాం. ఇద్దరికి ఒకే రకమైన వస్త్రాలు కొనుగోలు చేసి ఆనందాన్ని పంచుకుంటాం. ఇద్దరు కూతుళ్లు కూడా ఒకరిని విడిచి మరొకరు ఉండరు. బంధువులు ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ప్రేమను పంచడంతో మురిసిపోతాం.

–అజ్మీర విజయ్‌కుమార్‌ప్రమీళ, బోజ్యానాయక్‌తండా

అభిరుచులు ఒకటే..



మొదటి సంతానంలో కుమారుడు జన్మించగా రెండో సంతానంలో ఒకే పోలికతో జన్మించిన దీపిక, దీక్షికరెడ్డిల అభిరుచులు ఒకే విధంగా ఉంటాయి. ఆటపాటలతో పాటు చదువుల్లో కూడా ప్రతిభ కనబరుస్తారు. బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఇద్దరు కలిసి వెళ్తారు. కొత్త వారు చూసినప్పుడు ఎవరి పేరు ఏమిటో గుర్తు పట్టలేని విధంగా ఉండడం సంతోషాన్ని కలిగిస్తుంది.

–తల్లిదండ్రులు నరేశ్‌రెడ్డి,లావణ్యతో దీపిక, దీక్షికరెడ్డి

ఐక్యంగా ఉంటారు..



మాకు మొదటి సంతానంలో కవల లు జన్మించారు. వీరికి ఫుర్ఖాన్, అఫాన్‌లుగా పేర్లు పెట్టాం. ఇద్దరు ఐక్యంగా ఉండడంతో పాటు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. కవల పిల్లలు జన్మించడం, వారి పోలికలు కూడా ఒకేలా ఉండడం ఆనందాన్ని కలిగిస్తుంది.

–తల్లిదండ్రులు ఫయాజుద్దీన్,ఆరిఫాబేగంతో ఫుర్ఖాన్, అఫాన్

ఉచ్చుకు బలైంది చిరుతపులే!

- నిందితుడు తీసిన ఫొటోల ఆధారంగా గుర్తింపు
- సీసీఎంబీ నుంచి రిపోర్ట్ వచ్చాకే అధికారిక వెల్లడి


ఉచ్చుకు బలైన అనంతరం నిందితుడు తీసిన చిరుతపులి ఫొటో

భూపాలపల్లి: భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలైంది చిరుత పులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. పదిహేను రోజుల క్రితం భూపాలపల్లి రేంజ్ పరిధిలోని రాంపూర్ సెక్షన్‌లో రాజీవ్‌నగర్ నుంచి పంబాపూర్ వెళ్లే దారిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు పులి బలి అయినట్లు పుకార్లు షికార్లు చేశాయి. చనిపోయిన పులిని వేటగాళ్లు ఖననం చేసినట్లు చర్చ జరిగింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఖననం చేసిన స్థలం కోసం రెండు రోజుల పాటు తీవ్రంగా గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో అనుమానితులైన ఇద్దరిని ఈ నెల 15న రాత్రి అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో వేటకు బలైన అటవీ జంతువు ఏదనేది వారు పూర్తిగా సమాచారం ఇవ్వలేదు. దహనం చేసిన స్థలాన్ని చూపించగా అధికారులు అక్కడ ఉన్న ఎముకలు, పూర్తిగా కాలని కాలు, పుర్రెను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు 16వ తేదీన నిందితులను కోర్టులో హాజరు పరిచారు. అయితే చనిపోయింది పులి అని ప్రచారం జరిగినప్పటికీ, అది చిరుతపులి అని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో చనిపోయిన చిరుత పులి ఫొటోను గుర్తించి అదే కోర్టులో అందజేసినట్లు సమాచారం. పశు వైద్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాని కారణంగా సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ) రిపోర్టు కోసం వేచి చూస్తున్నట్లు తెలిసింది. నిందితుడి సెల్‌ఫోన్‌లో లభించిన ఫొటోతో పాటు ఉచ్చులు అమర్చిన స్థలంలో పాదముద్రలు (పగ్ మార్క్స్) ఆధారంగా అది పక్కా చిరుత పులేనని భావిస్తున్నారు. జిల్లా అడవుల్లో ఇంత వేట జరుగుతున్నా.. ఒక చిరుత పులి బలైనా సంబంధిత అధికారులు, సిబ్బందిపై అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోస్టాఫీస్ బ్యాంకింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ బానోత్ నందా


మాట్లాడుతున్న బానోత్ నందా

హన్మకొండ: పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంకింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ బానోత్ నందా అన్నారు. మంగళవారం హనుమకొండలోని తపాలా డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 ప్రధాన పోస్టాఫీస్‌లు, 49 సబ్ పోస్టాఫీస్‌లు, 337 బ్రాంచి పోస్టాఫీస్‌లో ఈ నెల 24 వరకు పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంకింగ్ మేళా జరుగుతుందన్నారు. ప్రజల్లో సేవింగ్ ఖాతాలు, తపాలా స్కీమ్‌లపై అవగాహన కల్పిస్తారన్నారు. తపాలా స్కీంల్లో పొదుపు చేసిన ఖాతాదారులకు బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా ద్వారా 4 శాతం వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఖాతాలో పొదుపు చేసిన సొమ్ముకు ఆదాయం పన్ను మినహాయింపు కూడా ఉంటుందన్నారు. పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ ఖాతా ద్వారా 5 సంవత్సరాల వరకు పన్ను ప్రయోజనం పొందే అవకాశముందన్నారు. వీటితో పాటు పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకం ఖాతా, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, 15 సంవత్సరాల పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన పథకం, హోల్ లైఫ్ అస్యూరెన్స్ ప్లాన్ సురక్ష, పీఎల్‌ఐ ఎండోమెంట్ అస్యూరెన్స్ ప్లాన్ సంతోష్, సువిధ, సుమంగల్, యుగల్ సురక్ష స్కీమ్‌లున్నాయన్నారు. ఖాతాదారులు నచ్చిన స్కీమ్‌లో పొదుపు చేసే అవకాశముంటుందన్నారు.

మితిమీరిన నన్నపునేని ఆగడాలు

- ఎమ్మెల్యే నరేందర్‌పై కాంగ్రెస్ చార్జ్‌షీట్ విడుదల

వరంగల్: టీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర సందర్భంగా మంగళవారం సాయంత్రం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌పై కాంగ్రెస్ పార్టీ చార్జ్‌షీట్‌ను విడుదల చేసింది. చార్జ్‌షీట్‌లోని ఆరోపణలు ఇలా ఉన్నాయి.

- చౌరస్తాలోని బీట్ బజార్లో వీధి వ్యాపారస్తులకు టాక్స్ విధించి దౌర్జన్యంగా పన్ను వసూలు చేస్తున్నాడు.
- ఎన్నికలకు ముందు అజాం జాహీ మిల్లు తెరుస్తామని హామీ ఇచ్చి మోసం చేశాడు. ఈ విషయంపై ప్రశ్నిస్తే అనుచరులతో దాడులు చేయిస్తున్నాడు.
- వరద ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మతుల నిర్వహణకు రూ.25 కోట్లు ఇస్తామని చెప్పి ఎమ్మెల్యే, కేటీఆర్ దగా చేశారు. కమీషన్లు అడుగుతుండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టులు ముందుకు రావడం లేదు.
- ఉర్సుగుట్ట చుట్టూ ఉన్న భూములను ఎమ్మెల్యే అనుచరులు గుంజుకుంటున్నారని, స్థానికులు ఫిర్యాదు చేస్తే ఏ ఎమ్మెల్యే పట్టించుకోకపోగా, వారిపై దాడులు చేయమని పురమాయిస్తున్నారు.
- డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి పేదల దగ్గరి నుంచి రూ. 23 లక్షలు వసూళ్లు చేశారు. ఎన్టీఆర్ నగర్‌లో 540 ఇళ్లు పూర్తయినప్పటికీ కార్పొరేటర్లకు పంపిణీ చేశారు గానీ లబ్ధిదారలకు ఇవ్వలేదు.
- నన్నపునేని అరాచకాలు అరికట్టి... వరంగల్ తూర్పు అభివృద్ధికి అడుగేయాలని చార్జ్‌షీట్‌లో కాంగ్రెస్ పార్టీ కోరింది.

పురాతనమైన శివాలయంలో మోడళ్లు



కోటలో మోడళ్ల సందడి..

ఖిలా వరంగల్: ఖిలావరంగల్ కోటకు మంగళవారం పలు రాష్ట్రాలకు చెందిన ఫ్యాషన్ మోడళ్లు సందర్శించారు. ఫ్యాషన్ డిజైనర్ సాధిక్ రాజ్, వేద ఫ్యాషన్ డైరెక్టర్ శిల్పతో కలిసి సందడి చేశారు. ఏకశిల గుట్ట, ఏకశిల పార్కు, గుండు చెరువు అందాలను తిలకించారు. కేరంతలు, ఆహ్లాదమైన వాతవరణంలో ఫ్యాషనర్స్ సరదగా గడుపుతూ ఫొటోలు దిగారు. వారి వెంట ఆర్ఆర్ మేకప్ క్రష్ అకాడమీ స్టూడియో డైరెక్టర్ రాఘవరెడ్డి, వైష్ణవినేత ఉన్నారు.

అత్యాచార నిందితుడికి జైలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం పరిధిలో ఓ యువతిపై ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన గండి చిన్నమ్మనాయుడు అత్యాచారం కేసులో భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టు జడ్జి నారాయణబాబు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 30వేల జరిమానా విధించారు. వివరాలిలా ఉన్నాయి.. 2016లో కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై అత్యాచారం కేసు నమోదు కాగా ఆ కేసును అప్పటి కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు దర్యాప్తు చేసి, చార్జ్‌షీట్ వేశారు. దీంతో మంగళవారం ట్రయల్‌లో ప్రభుత్వం తరఫున న్యాయవాది అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శివరాజ్ బాధితుల పక్షాన వాదనలు వినిపించి నేరస్తునికి శిక్షపడేలా చేశారు. కోర్టు కానిస్టేబుల్ వరలక్ష్మి, భిక్షపతిలను జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి అభినందించినట్లు కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య

ములుగు రూరల్(గోవిందరావుపేట): పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కన్నగంటి ప్రభాకర్‌చారి (53) తన సొంత భూమితో పాటు 5 ఎకరాలు కౌలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాగు చేసిన పంట ఆశించిన దిగుబడి రాకపోవడం, అప్పులు తీర్చ లేక కూతురి పెళ్లి ఎలా చేయాలనే మనోవేదనకు గురై ఈ నెల 19న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభాకర్‌చారిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్ణాకర్‌రావు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

వరంగల్ క్రైం: తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రలో బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఈనెల 20న రేవంత్‌రెడ్డి పాదయాత్రలో కానిస్టేబుల్ సాదిక్ పాషా రోప్ బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నాడు. కమలాపూర్ మండలం మరిపెల్లిగూడెంకు చెందిన ఉప్పుల శివప్రసాద్ రోప్ పార్టీని దాటుకొని రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లే క్రమంలో సాధిక్ పాషా అడ్డుకున్నాడు. దీంతో కక్ష కట్టిన నిందితుడు ఉద్దేశ పూర్వకంగా ఏషియన్ మాల్ ప్రాంతంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఆయన తెలిపారు. పోలీసు అధికారుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- రూ.34 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- ఉప సర్పంచ్‌తో సహా నలుగురు అరెస్ట్


అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠా టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ తెలిపారు. ఉపసర్పంచ్‌తో పాటు నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుంచి రూ.34 లక్షల విలువగల 170 కిలోల గంజాయి, కారు, బొలెరో వాహనం, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గొరుకొత్తపల్లికి చెందిన రాయినేని శంకర్, వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన ముసిక లక్ష్మణ్, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన మాత్ర మహేష్, పస్రాకు చెందిన గండికోట సతీష్‌లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. నిందితులు రాయినేని శంకర్, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ఉపసర్పంచ్ ముసిక లక్ష్మణ్ సులభంగా డబ్బు సంపాదించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఏపీలోని నర్సీపట్నంకు చెందిన పరారీలో ఉన్న నిందితుడు సూకరాజు ద్వారా 170 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి బొలెరో వాహనంలో ఎవరికి అనుమానం రాకుండా కొబ్బరి బొండాల మధ్యలో రహస్యంగా భద్రపర్చి వరంగల్‌కు తరలిస్తున్నారు. గంజాయిని వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో నిందితులు రాయినేని శంకర్, ముసిక లక్ష్మణ్‌లు కారులో ఎస్కార్ట్‌గా గంజాయి తరలిస్తున్న వాహనానికి వెళ్లారు. మంగళవారం ఆత్మకూరు గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా వస్తున్న నిందితుల వాహనాలను తనిఖీ చేయగా బొలెరో వాహనంలో కొబ్బరి బోండాల మధ్య గంజాయి ప్యాకెట్లు దొరికినట్లు డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పరకాల ఏసీపీ శివరామయ్య, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ బి.కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిసార్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్యామ్, రాజు, భిక్షపతి, సురేష్, శ్రవణ్, నవీన్, కరుణాకర్‌లను ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్ అభినందించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

ఖిలా వరంగల్: కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. మరికొద్ది రోజుల్లో హెడ్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తి అవుతుందని, తమ కలలు నెరవేరే రోజు దగ్గరలోనే ఉందని సంతోష పడ్డారు. కానీ గుండెపోటుతో కానరాని లోకాలకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నాంపెల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీనారాయణ (54)కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. 42 రోజుల పాటు హెడ్‌కానిస్టేబుల్ శిక్షణ కోసం వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలకు ఈనెల 6న శిక్షణలో చేరాడు. మహాశివరాత్రి సందర్భంగా శని, ఆదివారం రెండురోజులు సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 9 గంటలలోపే తిరిగి ట్రైనింగ్‌లో చేరాడు. అదేరోజు రాత్రి 8 గంటలకు వాంతులు విరోచనాలు కావడంతో గమనించిన పోలీస్ అధికారులు ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీనారాయణ మృతి చెందడంతో పీటీసీ ప్రిన్సిపల్ ఇంజారపు పూజ, పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి, నివాళులర్పించారు. డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, కాశీరాం, మహేష్, శ్రీకాంత్, సీఎల్ఐ నరేష్‌కుమార్, రవీందర్, రాజ్యలక్ష్మి, ఏఎల్ఐ రాధిక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామాచారి ఉన్నారు.

కంచె వద్దు.. ప్రత్యామ్నాయం ముద్దు

- విద్యుత్ కంచెలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న రైతులు
- వీటి ఏర్పాటుకు అనుమతులు లేవంటున్న అధికారులు
- ఇతర రక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని సూచన
- నాలుగు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మృత్యువాత


కిరణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- ఈ నెల 18న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లికి చెందిన బండకింది నర్సింహులు (42) వరి పొలంలో నీరు చూడడానికి వెళ్లాడు. పక్క భూమి గల బండారు రాజయ్య అనే రైతు పంట రక్షణకు అడవిపందుల నివారణకు పొలం చుట్టూ ఉన్న ఇనుప ముళ్లకంచెకు కరెంటు షాక్ పెట్టాడు. అది గమనించని నర్సింహులు ఇనుప కంచె తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.
- తాజాగా మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ దుమ్లా తండాకు చెందిన అంగోతు సీవీ నాయక్ తమ మొక్కజొన్న పంటను కోతుల నుంచి రక్షించుకోవడానికి విద్యుత్ వైర్లతో అక్రమంగా కంచె ఏర్పాటు చేశాడు. మంగళవారం వేకువజామున సీవి నాయక్ కుమారుడు కిరణ్‌తో కలిసి కాపలా వెళ్లారు. కిరణ్ ఆదమరిచి విద్యుత్ ప్రవాహము న్న వైర్లపై పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుమారుడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.

హన్మకొండ: జంతువులు ఇతర వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అక్రమంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దని విద్యుత్ అధికారులు, టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. అవేమి పట్టనట్లు కొందరు వ్యవహరిస్తున్న తీరుతో ప్రాణనష్టం కలుగుతుంది. వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడేందుకు ముళ్ల కంచెలతో పాటు, ఇతర మొక్కలు నాటే పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. వీటిని కాదని అధిక వోల్టేజీతో విద్యుత్ ప్రసరణ జరిగే లోహపు తీగలతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. పంటల రక్షణకు ఏర్పాటు చేస్తున్న లోహపు తీగను పశువులు, జంతువులు, వన్యప్రాణులు, వ్యక్తులు తాకినప్పుడు విద్యుదాఘాతానికి గురవుతూ ప్రాణనష్టం జరుగుతుంది. కొంతమంది వన్యప్రాణులను వేటాడేందుకు సైతం విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదమని తెలిసినా..

రైతులు పంటలు కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం ప్రమాదమని తెలిసినా కంచెలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. ఈ సమాచారం తెలియని పక్క రైతులు, పశువులు అటు వైపు వెళ్లడంతో విద్యుత్ షాక్‌కు గురవుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వారిపై అధికారులు కేసులు నమోదు చేయిస్తున్నారు.

ప్రత్యామ్నాయాల ఏర్పాటు..

పశువులు, కోతులు, ఇతర వన్యప్రాణుల నుంచి పంటలు కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులవైపు ఆలోచించాలని ఎన్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. రికార్డింగ్ మైక్‌లు, ఇతర శబ్దాలు వచ్చే పరికరాల ఏర్పాటుతో కూడా అడవి జంతువుల బెడద తగ్గించుకోవచ్చని తెలిపారు.